ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తమిళనాడు
TAMILNADU
మంగళవారం 2 జూలై 2024



గూడలూరు, పందలూరులో కుండపోత

● స్తంభించిన జనజీవనం



గూడలూరులో మోకాలిలోతు వరదనీటిలో నడచివెళ్తున్న స్థానికులు

చెన్నై, జూలై 1 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లాలో నైరుతి రుతుపవనాలు తీవ్రరూపం దాల్చటంతో ఆ జిల్లాలోని గూడలూరు, పందలూరు తాలూకాల్లో గత మూడు రోజులుగా కుండపోతగా కురిసిన భారీ వర్షాలకు జనజీవనం స్తంభించింది. పల్లపు ప్రాంతాలన్నీ జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. రహదారుల్లో వర్షపునీరు వరదలా ప్రవహిస్తోంది. గూడలూరు, పందలూరు ప్రాంతాల్లో ఆదివారం ఉదయం నుండి రాత్రి వరకు చెదురుమదురుగా వర్షాలు కురిశాయి. ఆ తర్వాత సోమవారం వేకువజాము కుండపోత వర్షం కురిసింది. దీంతో జననివాస ప్రాంతాలన్నీ జలదిగ్బంధంలో కొట్టుమిట్టాడుతున్నాయి. పలుచోట్ల ఇళ్లలోకి వర్షపు నీరు చొరబడటంతో ప్రజలు దిగ్భ్రాంతి చెందారు. వర్షానికి పెనుగాలులు తోడవడంతో పలు ప్రాంతాలల్లో చెట్లు కూలిపడ్డాయి. పాడతురై, కుచ్చిమూచ్చి ప్రాంతాల్లో గత రెండు రోజులుగా చెదురుమదురుగా వర్షాలు కురిశాయి. ఆదివారం సాయంత్రం మళ్ళీ జోరుగా వర్షం కురవటంతో ఆ రెండు ప్రాంతాల్లోని ఇళ్లచుట్టూ వర్షపునీరు వరదలా ప్రవహించడంతో ప్రజలు ఇళ్ల నుండి బయటకు కదలలేని పరిస్థితులు నెలకొన్నాయి. వాగులు, వంకలు వర్షపునీటితో నిండి పొంగి ప్రవహిస్తుండటంతో వాటి ఒడ్డున ఇళ్లలో నివసిస్తున్నవారంతా ఆందోళనకు గురవుతున్నారు. సోమవారం ఉదయం కూడా గూడలూరు, పందలూరు ప్రాంతాల్లో చెదురుముదురుగా వర్షాలు కురవటంతో ఆ రెండు తాలూకాలలోని పాఠశాలలకు అధికారులు సెలవు ప్రకటించారు.

పలు ప్రాంతాల్లో వర్షాలు

● వాతావరణ కేంద్రం వెల్లడి

అడయార్, జూలై 1: బంగాళాఖాతంలో అల్పపీడనంతో పాటు నైరుతి రుతుపవనాల కారణంగా వాతావరణంలో ఏర్పడిన మార్పుల కారణంగా ఈ నెల 2 నుంచి 6 వరకు పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తాయని చెన్నై ప్రాంతీయ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలతో పాటు పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ముఖ్యంగా కోయంబత్తూరు, నీలగిరి జిల్లాల్లో భారీ వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. మరోవైపు రాజధాని చెన్నై నగరంలోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి వర్షపు జల్లులు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. సోమవారం చెన్నైతో పాటు కాంచీపురం, చెంగల్పట్టు, తిరువళ్ళూరు జిల్లాల్లో వాతావరణం పొడిగా ఉందని తెలిపింది. రానున్న 24 గంటల్లో ఆకాశం మేఘావృతంగా ఉంటుందని, నగరంలోని కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది.

ఆగని శ్రీలంక దాడులు

సముద్రంలో దిగి మత్స్యకారుల నిరసన



పాంబన్ వద్ద సముద్రంలో దిగి శ్రీలంకకు నిరసన తెలుపుతున్న జాలర్లు

ప్యారీస్, జూలై 1: బంగాళాఖాతంలో చేపలు పడుతున్న రామేశ్వరానికి చెందిన 25 మంది జాలర్ల అరెస్ట్‌ను ఖండిస్తూ శ్రీలంకకు వ్యతిరేకంగా సోమవారం రామనాథపురం జిల్లాలోని పలు ప్రాంతాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. పాంబన్ హైరోడ్డులో వందలాది మంది జాలర్లు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టడంతో ఆ మార్గంలో సుమారు రెండు గంటల పాటు వాహనాలు బారులుతీరాయి. అదే విధంగా పాంబన్ వద్ద సముద్రంలో దిగిన జాలర్లు శ్రీలంక కోస్ట్‌గార్డ్ దాష్టీకాన్ని ఎండగడుతూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఆందోళనలో పాల్గొన్న జాలర్లు మాట్లాడుతూ... ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 32 భారతీయ జాలర్ల పడవలను స్వాధీనం చేసుకొని 238 మంది జాలర్లను శ్రీలంక కోస్ట్‌గార్డ్ బలగాలు అరెస్ట్ చేయడం ఖండించదగ్గదన్నారు. సముద్ర సరిహద్దులు దాటారనే కారణంతో ఆ బలగాలు తమిళులపై దాడులకు పాల్పడుతున్నాయని, చేపల వేటకు సముద్రంలోకి వెళ్లే తమకు భద్రత కల్పించేలా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని కోరారు. శుక్రవారం రామేశ్వరం, ధనుష్కోటి, పాంబన్ ప్రాంతాల నుంచి నాలుగు మరబోటుల్లో చేపల వేటకు వెళ్లిన 25 మంది జాలర్లను వెంట నే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.

నీట్ వద్దు... ద్విభాషా విధానమే ముద్దు

● జస్టిస్ మురుగేశన్ కమిటీ సిఫారసు ● సీఎం స్టాలిన్‌కు నివేదిక సమర్పణ



నూతన విద్యావిధానంపై రూపొందించిన నివేదికను ముఖ్యమంత్రికి అందజేస్తున్న జస్టిస్ డి. మురుగేశన్

చెన్నై, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నీట్ ఆధారంగా వైద్యవిద్యా కోర్సుల్లో అడ్మిషన్లు జరుపరాదని, ప్లస్-2 పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులకు వచ్చిన మార్కులను బట్టి అడ్మిషన్లు జరగాలని జస్టిస్ డి. మురుగేశన్ కమిటీ సిఫారసు చేసింది. సచివాలయంలో సోమవారం ఉదయం ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కలుసుకుని జస్టిస్ మురుగేశన్, కమిటీ సభ్యులు నూతన విద్యావిధానంపై రూపొందించిన ప్రత్యేక నివేదిక సమర్పించారు. 2021 -22 వార్షిక బడ్జెట్‌లో రాష్ట్ర చరిత్ర, సంస్కృతీ సంప్రదాయాలకు అనుగుణంగా విద్యార్థుల బంగారు భవిష్యత్తును అందించేందుకు వీలుగా నూతన విద్యావిధానాన్ని రూపొందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఆ మేరకు హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ డి.మురుగేశన్ నాయకత్వంలో కొత్త కమిటీ ఏర్పాటు చేసింది. ఇటీవలే ఆ కమిటీ నూతన విద్యావిధానాలపై సమగ్రమైన నివేదిక రూపొందించింది. ఆ నివేదికను ముఖ్యమంత్రి స్టాలిన్‌కు జస్టిస్ మురుగేశన్ అందజేశారు. ఆ కమిటీ సభ్యులైన ప్రొఫెసర్ రామ్ శీనువాసన్, రచయిత ఎస్.రామకృష్ణన్, ప్రొఫెసర్ సుల్తాన్ అహమ్మద్ ఇస్మాయిల్, ప్రొఫెసర్ అరుణా రత్నం, జయశ్రీ దామోదరన్, తులసీదాసన్, టీఎం కృష్ణా, ఇరా బాలు, ప్రొఫెసర్ ఫరీదా జ్ఞానరాణి, ప్రొఫెసర్ పళని, కమిటీ మెంబర్ సెక్రటరీ ప్రొఫెసర్ ఎ.కరుప్పసామి, పాఠశాలల విద్యాశాఖ కార్యదర్శి జే. కుమారబరన్, పాఠశాలల విద్యాశాఖ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్. కన్నప్పన్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

3, 5, 8 తరగతులకు పబ్లిక్ పరీక్షలు వద్దు...

రాష్ట్రంలో 3, 5, 8 తరగతుల విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు నిర్వహించకూడదని, ప్రభుత్వ పాఠశాలల్లో ప్లస్-1 పబ్లిక్ పరీక్షలు కొనసాగించాలని జస్టిస్ మురుగేశన్ కమిటీ సిఫారసు చేసింది. అదే విధంగా ప్లస్-1, ప్లస్-2 పబ్లిక్ పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా ఉన్నత విద్యా కోర్సుల్లో ప్రవేశం కల్పించాలని కూడా ఆ కమిటీ ప్రభుత్వానికి ప్రతిపాదించింది. అదే విధంగా రాష్ట్రంలో తమిళం, ఆంగ్లభాషలకే ప్రాధాన్యం కల్పించేలా ద్విభాషా విధానమే పాఠశాలల్లో అమలు చేయాలని కమిటీ గట్టిగా సిఫారసు చేసింది.

కొత్త క్రిమినల్ చట్టాలకు నిరసనగా

రాష్ట్రవ్యాప్తంగా లాయర్ల ఆందోళన

● స్తంభించిన కోర్టు విధులు

అడయార్, జూలై 1: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు క్రిమినల్ చట్టాలు జూలై ఒకటో తేదీ నుంచి అమల్లోకి వచ్చాయి. ఈ చట్టాలకు వ్యతిరేకంగా రాష్ట్రంలోని న్యాయవాదులు ప్రత్యక్ష ఆందోళనకు దిగారు. దీంతో సోమవారం కోర్టు విధులకు ఆటంకం కలిగింది. ఈ చట్టాల అమలుకు నిరసనగా న్యాయవాదులు సోమవారం కోర్టుల్లో తమ విధులను బహిష్కరించారు. దేశంలో 150 యేళ్ళ క్రితం బ్రిటీష్ పాలకులు రూపొందించిన ఐపీసీ, సీఆర్‌పీసీ, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ 1872 చట్టాలు అమల్లో ఉన్నాయి. వీటి స్థానంలో కేంద్రం మూడు కొత్త క్రిమినల్ చట్టాలను తీసుకువచ్చింది. ఐపీసీ స్థానంలో భారతీయ న్యాయ సంహిత, 2023, సీఆర్‌పీసీ స్థానంలో భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, ఐఈఏ స్థానంలో భారతీయ సాక్ష్య పేరుతో ఈ చట్టాలను రూపొందించింది. సీఆర్‌పీసీ చట్టంలో 484 సెక్షన్లు ఉండగా, కొత్తగా తీసుకొచ్చిన భారతీయ నాగరిక్ సురక్షా సంహిత చట్టాన్ని మాత్రం 531 సెక్షన్లతో తయారు చేశారు. ఇందులో 177 సెక్షన్లలో మార్పులు చేయగా, మరో 9 సెక్షన్లను కొత్తగా చేర్చారు. 14 సెక్షన్లను రద్దు చేశారు. అదే విధంగా ఐపీసీలో 511 సెక్షన్లుండగా, కొత్త చట్టంలో 358 సెక్షన్లున్నాయి. వీటిలో కొత్తగా 21 నేరాలను చేర్చారు. మరో 41 నేరాలకు విధించే జైలు శిక్షా కాలాన్ని పెంచారు. 82 నేరాల్లో విధించే అపరాధ రుసుము మొత్తాన్ని పెంచగా, 25 నేరాలకు నిర్బంధ అపాధం విధించేలా కొత్త చట్టంలో పొందుపరిచారు. ఈ చట్టాలు సోమవారం నుంచి అమల్లోకి వచ్చాయి. ఈ చట్టాల అమలును నిలిపివేయాలని ముఖ్యమంత్రి స్టాలిన్‌తో పాటు ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పలు రాజకీయ పార్టీల నేతలు కోరారు. కానీ, కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం లెక్కచేయకుండా ఈ చట్టాలను అమలు చేస్తుంది. ఈ నిరంకుశ చర్యకు నిరసనగా న్యాయవాదులు రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు పిలుపునిచ్చారు. ఇందులోభాగంగా న్యాయవాదులు రాష్ట్ర వ్యాప్తంగా కోర్టు విధులను బహిష్కరించారు. ముఖ్యంగా రాజధాని నగరం చెన్నై, మదురై, కోయంబత్తూరు, నాగర్‌కోయిల్, తిరుచ్చి, సేలం, తిరునెల్వేలి తదితర ప్రాంతాల్లోని కోర్టుల్లో అడ్వకేట్లు విధులను బహిష్కరించారు. ఈ కొత్త చట్టాలను ఉపసంహరించేంత వరకు రాష్ట్రంలో వివిధ రూపాల్లో ఆందోళను చేపట్టాలని న్యాయవాద సంఘాలు నిర్ణయించాయి. దీంతో కోర్టుల కార్యక్రమాలు స్తంభించిపోనున్నాయి.

కళ్లకుర్చి కల్తీసారా సంఘటన..

సుమోటోగా హైకోర్టు విచారణ

● కల్వరాయన్‌మలై వాసులకు పునరావాసం కల్పించాలి

అడయార్, జూలై 1: కళ్ళకుర్చిలోని కల్వరాయన్‌మలై, సేలంలోని గిరిజన తెగలకు(ఎస్టీ) పునరావాసం కల్పించాలని మద్రాస్ హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం సూచన చేసింది. ఈ రెండు ప్రాంతాల్లోని గిరిజనులకు విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలతో పాటు రోడ్లు, విద్యుత్ సౌకర్యాన్ని కల్పించాలని పేర్కొంది. ఇటీవల కళ్ళకుర్చిలో కల్తీసారా తాగి 65 మంది వరకు ప్రాణాలు కోల్పోయిన వైనం దేశ వ్యాప్తంగా పెను సంచలనంగా మారింది. దీనిపై మద్రాస్ హైకోర్టు సీనియర్ న్యాయవాది తమిళ్‌మణి టీవీ చానెళ్లకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కల్తీసారా తయారీలో కొండ ప్రాంతాలకు చెందిన గిరిజనులు పాలుపంచుకోవడానికి గల కారణాలను వివరించారు. ఈ ఇంటర్వ్యూను మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తులు ఎస్ఎం సుబ్రమణ్యం, సి.కుమరప్పన్ వీక్షించి, ఈ కేసును సుమోటోగా స్వీకరించారు. ఈ సందర్భంగా వారి స్పందన వారి మాటల్లోనే... 'కల్తీసారా ఘటనపై సీబీసీఐడీ విచారణ జరుపుతుంది. మద్రాస్ హైకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. అందువల్ల ఈ కేసు పూర్వాపరాల్లోకి వెళ్ళడం ఇష్టంలేదు. కానీ, సీనియర్ అడ్వకేట్ తమిళ్‌మణి ఇచ్చిన ఇంటర్వ్యూలో కల్వరాయన్‌మలై, సేలం తదితర ప్రాంతాల్లోని కొండ జాతి తెగ ప్రజలు జీవిస్తున్నారు. వారిని మూడు జాగీర్దారులు పాలించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా తమ ప్రాంతాన్ని విలీనం చేసేందుకు సమ్మతించలేదు. 1976 వరకు వారంతా ప్రత్యేక ప్రాంతంగానే ఉన్నారు. దేశంలో ఎమర్జెన్సీ విధించిన సమయంలోనే కల్వరాయన్‌మలై తదితర కొండ ప్రాంత గ్రామాలను దేశంలో విలీనం చేశారు. అప్పటి దక్షిణ ఆర్కాట్ జిల్లా కలెక్టర్ తీసుకున్న చొరవ కారణంగా ఇది సాధ్యమైంది. అనంతరం 1996లో కల్వరాయన్‌మలై తదితర ప్రాంతాలకు చెందిన కొండజాతి ప్రజలు తొలిసారి ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇది ఎంతో ఆశ్చర్యం కలిగిస్తుంది. 1976 వరకు ఈ మూడు ప్రాంతాల్లో భారతదేశంలో అంతర్భాగం చేయకపోవడం వల్ల కనీస సౌకర్యాలు, ఉపాధి అవకాశాలకు వారంతా దూరంగా ఉన్నారు. ఈ కారణంగానే కల్తీసారా తయారీలో వారు నిమగ్నమయ్యారు. భారతదేశ ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించాలని దేశ రాజ్యాంగం చెబుతోంది. ఇదే అంశంపై 1995లో సుప్రీంకోర్టు సుదీర్ఘమైన తీర్పును కూడా వెలువరించింది. అందువల్ల కల్వరాయన్ మలై కొండ ప్రాంతంలో నివసించే గిరిజనులతో పాటు సేలం జిల్లాలో ఉండే ఎస్టీ ప్రజలకు కూడా రవాణా, విద్య, వైద్య, ఉపాధి, వంటి కనీస సౌకర్యాలను కల్పించాలి. అందువల్ల మేము సుమోటోగా ఈ కేసును స్వీకరిస్తున్నాం. ఈ కేసులో ప్రభుత్వప్రధాన కార్యదర్శి, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి, సేలం, కళ్ళకుర్చి జిల్లాల కలెక్టర్లను కూడా పిటిషనర్లుగానే చేర్చుతున్నాం. అదేసమయంలో సుమోటోగా కేసు చేపట్టేందుకు ఆమోదం తెలుపాలని, ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని మద్రాస్ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి ఆర్.మహాదేవన్‌కు పంపుతున్నాం' అని ఇద్దరు న్యాయమూర్తులు పేర్కొన్నారు.

పారిస్ ఒలింపిక్స్ ..

రాష్ట్ర క్రీడాకారులకు రూ.35 లక్షలు



క్రీడాకారులతో ముఖ్యమంత్రి స్టాలిన్, మంత్రి ఉదయనిధి తదితరులు

చెన్నై, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పారిస్‌లో జరుగనున్న ఒలింపిక్స్, పారాలింపిక్స్ పోటీలకు ఎంపికైన రాష్ట్ర క్రీడాకారులు ఐదుగురికి రూ.35 లక్షల ప్రోత్సాహక నగదును ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అందజేశారు. సచివాలయంలో క్రీడాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం జరిగిన కార్యక్రమంలో ఒలింపిక్స్‌లో పాల్గొనేందుకు వెళ్తున్న ఐదుగురు క్రీడాకారులకు ముందస్తు ఏర్పాట్లు, ప్రయాణ ఖర్చులకు తలా రూ.7లక్షల చొప్పున చెక్కులను ఆయన అందజేశారు. ఒలింపిక్స్ పోటీలకు రాష్ట్రం నుంచి మొత్తం 15 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. వీరిలో పృథ్వీరాజ్ తొండైమాన్ (రైఫిల్ షూటింగ్), తులసిమది మురుగేశన్ (పారా బ్యాడ్మింటన్), మనిషా రామదాస్ (పారా బ్యాడ్మింటన్). నిత్యశ్రీ సుమతి శివన్ (పారా బ్యాడ్మింటన్), శివరంజన్ సోలైమలై (పారా బ్యాడ్మింటన్)కు ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రోత్సాక నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో యువజన సంక్షే మం క్రీడాభివృద్ధి శాఖల మంత్రి ఉదయనిధి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా, యువజన సంక్షేమం క్రీడాభివృద్ధి శాఖల ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి అతుల్యమిశ్రా, రాష్ట్ర క్రీడాభివృద్ధి సంస్థ మెంబర్ సెక్రటరీ జే మేఘనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'స్పేస్ బే'గా 4 జిల్లాలు

● పదేళ్లలో 10 వేలమందికి ఉద్యోగాలు ● నూతన అంతరిక్ష విధానం విడుదల

చెన్నై, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అంతరిక్ష సంబంధిత పరిశ్రమలు నెలకొల్పే సంస్థలకు ప్రభుత్వం కల్పించనున్న సదుపాయాలు, రాయితీలకు సంబంధించిన నూతన అంతరిక్ష విధానాన్ని టిడ్కో విడుదల చేసింది. రాష్ట్రంలో భారత అంతరిక్ష పరిశోధనా కేంద్రం (ఇస్రో) ఆధ్వర్యంలో కులశేఖరపట్టినం వద్ద రెండో రాకెట్ ప్రయోగ కేంద్రాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఆ కేంద్రం చుట్టూ ఉన్న తూత్తుకుడి, తిరునల్వేలి, మదురై, విరుదునగర్ జిల్లాలను 'స్పేస్ బే'గా ప్రభుత్వం ప్రకటించింది. అంటే ఈ నాలుగు జిల్లాలను అంతరిక్ష సంబంధిత పరిశ్రమల విస్తరణ జిల్లాలుగా రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసి అధికారిక ప్రకటన చేసింది. నూతన అంతరిక్ష విధానం ప్రకారం ఈ నాలుగు జిల్లాల్లో రూ.300 కోట్లకుపైగా పెట్టుబడులు పెట్టే సంస్థలకు మూలధన సబ్సిడీ, చౌక ధరలకు భూములు, విద్యుత్ సంబంధిత రాయితీలు కల్పించనున్నారు. ఎ కేటగిరిలో ఉన్న చెన్నై సహా నాలుగు జిల్లాల్లో అంతరిక్ష పరిశోధన సంబంధిత పరిశ్రమలు స్థాపించేవారికి ఐదు శాతం మూలధన రాయితీని ఐదేళ్ల వరకూ కొనసాగించనున్నారు. అదే విధంగా బి కేటగిరిలో ఉన్న కోయంబత్తూరు, ఈరోడ్ సహా 18 జిల్లాల్లో పరిశ్రమలు పెడితే ఏడు శాతం మూలధన రాయితీ ఐదేళ్ల వరకు అందించనున్నారు. సి కేటగిరిలో ఉన్న ధర్మపురి, కన్నియాకుమారి సహా 19 జిల్లాల్లో పరిశ్రమలు స్థాపిస్తే పది శాతం సబ్సిడీని పదేళ్ల వరకు అందించనున్నారు. డి కేటగిరిలో ఉన్న మదురై, తూత్తుకుడి, తిరునల్వేలి, విరుదునగర్ జిల్లాలను స్పేస్ బే జిల్లాలుగా ప్రకటించడంతో ఆ జిల్లాల్లో అంతరిక్ష పరిశోధన సంబంధిత పరిశ్రమలను విరివిగా విస్తరింపజేయనున్నారు. ఏ, బీ కేటగిరి జిల్లాలోని సిప్కాట్, సిడ్కో, టిడ్కో తదితర పారిశ్రామిక వాడల్లో పెట్టుబడులు పెడితే భూముల ధరలో 20 శాతం రాయితీ ప్రకటించనున్నారు. సీ. డీ కేటగిరిలోని జిల్లాల్లో పరిశ్రమలు స్థాపిస్తే 50 శాతం రాయితీ ధరతో భూములు కేటాయిస్తారు. అంతే కాకుండా భూములు కొనుగోలు చేసేటప్పుడు వంద శాతం స్టాంపు డ్యూటీ కూడా మినహాయించనున్నారు. ఐదేళ్ల పాటు విద్యుత్ పన్ను నుంచి వంద శాతం మినహాయిస్తారు. అంతే కాకుండా ప్రభుత్వ నూతన అంతరిక్ష విధానం ద్వారా పదేళ్లలో పదివేల మందికి నెలకు కనీసం రూ.10వేల వేతనంతో ఉద్యోగవకాశాలు లభిస్తాయని కూడా సిడ్కో అధికారులు ప్రకటించారు.



కులశేఖరపట్టినం వద్ద నిర్మిస్తున్న ఇస్రో రాకెట్ ప్రయోగ కేంద్రం

సమాచార దర్శిని

దరఖాస్తుల సవరణకు అవకాశం

ఐసిఎఫ్, జూలై 1: వెటర్నరీ వైద్యకోర్సులకు దరఖాస్తు చేసుకున్న వారు ఈనెల 3 నుంచి 5వ తేది వరకు సవరణలు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. రాష్ట్ర వెటర్నరీ సైన్స్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని కళాశాలల్లో బీవీఎస్‌ఈ, ఏహెచ్, బీటెక్ కోర్సుల్లో చేరేందుకు దరఖాస్తుల స్వీకరణ గత నెల 3 నుంచి 28వ తేది వరకు జరుగ్గా 17,497 మంది దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తుల్లో సవరణలకు ఈ నెల 3 నుంచి 5వ తేది వరకు అవకాశం కల్పించినట్లు వర్సిటీ తెలిపింది.

నేడు విద్యుత్ గ్రీవెన్స్

ఐసిఎఫ్, జూలై 1: స్థానిక కేకే నగర్, అంబత్తూర్, తండయార్‌పేట ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ గ్రీవెన్స్ జరుగనుంది. కేకే నగర్ ఉప విద్యుత్ కేంద్రం ప్రాంగణం, తండయార్‌పేట ఇంజనీర్ కార్యాలయం, అంబత్తూర్ ఉప విద్యుత్ కేంద్రం ప్రాంగణాల్లో ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ గ్రీవెన్స్‌లో వినియోగదారులు తమ సమస్యలకు పరిష్కారం పొందాలని విద్యుత్ బోర్డు సూచించింది.

12 విమానాల రద్దు

పెరంబూర్, జూలై 1: స్థానిక మీనంబాక్కం విమానాశ్రయం నుంచి వెళ్లాల్సిన 12 విమాన సర్వీసులు రద్దయ్యాయి. నగరం నుంచి ఢిల్లీ, షిర్డీ, హైదరాబాద్‌కు నడుపుతున్న 12 విమాన సర్వీసులు ఒకేరోజు రద్దయ్యాయి. నగరం నుంచి ఇతర నగరాలకు వెళ్లాల్సిన ఆరు విమానాలు, ఇతర నగరాల నుంచి నగరానికి రావాల్సిన మరో 6 విమానాలు రద్దయ్యాయి. నిర్వహణ కారణాల రీత్యా విమానాలు రద్దుచేసినట్లు విమానాశ్రయ అధికారులు తెలిపారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా విమానాలు రద్దుకావడంతో, వాటిలో ప్రయాణించాల్సిన ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

సంక్షేమ బోర్డు సభ్యులకు దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, జూలై 1: క్రైస్తవ ప్రార్థనాలయాల్లో పనిచేసే ఉపదేశకులు, ఉద్యోగులు సంక్షేమ బోర్డులో సభ్యులుగా చేరేందుకు దరఖాస్తు చేసుకోవచ్చని చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్ధార్థ్ తెలిపారు. దరఖాస్తులను జిల్లా మైనార్టీ సంక్షేమ కార్యాలయం, సింగారవేలర్ మాలిగై, కలెక్టర్ కార్యాలయం, రాజాజీ రోడ్డు, చెన్నై-1లో పొందవచ్చు. దరఖాస్తుతో పాటు జిల్లా పరిధిలోని రోమన్ క్యాథలిక్ చర్చి బిషప్, ప్రొటెస్టెంట్ చర్చి బిషప్ నుంచి పొందిన సర్టిఫికెట్లు జతపరచాలి. సభ్యులుగా చేరిన వారి పిల్లలకు విద్య, వివాహాలకు ఆర్థికసాయం, అంగవైకల్యం కలిగిన వారికి ప్రత్యేక ఆర్థికసాయం వంటివి అందజేస్తారు.

గ్రూప్-2, 2ఏ పరీక్షలకు దరఖాస్తుల స్వీకరణ

ఐసిఎఫ్, జూలై 1: టీఎన్‌పీఎస్సీ గ్రూప్-2, 2ఏలో ఖాళీగా ఉన్న 2,327 పోస్టుల భర్తీకి జూన్ 20న నోటిఫికేషన్ విడుదలైంది. దీని కోసం నిర్వహించనున్న రాతపరీక్షకు అభ్యర్థులు ఈ నెల 19వ తేది వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. గ్రూప్-2లో సహాయ లేబర్ ఇన్‌స్పెక్టర్, డిప్యూటీ వాణిజ్య పన్నుల అధికారి, జూనియర్ ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్, అవినీతి, నిరోధక పర్యవేక్షణ ప్రత్యేక అసిస్టెంట్, గ్రూప్-2ఏ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ పోస్టులకు ప్రిలిమినరీ పరీక్ష సెప్టెంబరు 14వ తేది జరుగనుందని, ఇతర వివరాలకు టీఎన్‌పీఎస్సీ వెబ్‌సైట్ చూడొచ్చని అధికారులు తెలిపారు.

స్పాంజి పార్కుల విస్తరణ

ఐసిఎఫ్, జూలై 1: నగరంలో వర్షపునీరు సేకరించేలా స్పాంజ్ పార్కులను విస్తరించనున్నట్లు కార్పొరేషన్ అధికారులు తెలిపారు. చెన్నై కార్పొరేషన్ పార్కుల శాఖ ఆధ్వర్యంలో ప్రజల కోసం 835 పార్కులు ఏర్పాటుచేసి పర్యవేక్షిస్తున్నారు. చెన్నై 2.0 పథకంలో వాననీటి సేకరణకు స్పాంజి పార్కులు ఏర్పాటుచేస్తున్నారు. ఈ నేపథ్యంలో, రూ.20 కోట్లతో అదనంగా మరికొన్ని స్పాంజ్ పార్కులు ఏర్పాటుచేయనున్నామని అధికారులు తెలిపారు.

ఊటీలో సినిమా షూటింగ్‌లకు అనుమతి

పెరంబూర్, జూలై 1:నీలగిరి జిల్లా ఊటీలో వేసవి సీజన్ ముగియడంతో సినిమా షూటింగ్‌లపై నిషేధం ఎత్తివేశారు. వేసవి సీజన్‌లో ఊటీకి వచ్చే పర్యాటకుల సౌకర్యార్థం ఉద్యానవన, పర్యాటక శాఖల ఆధ్వర్యంలో పండ్లు, పుష్ప, సుగంధ ద్రవ్యాల ప్రదర్శనలు ఏర్పాటుచేస్తుంటారు. ఈ కారణంగా బొటానికల్ గార్డెన్‌సహా 7 ప్రముఖ పర్యాటక స్థలాల్లో సినిమా షూటింగ్‌లకు జిల్లా యంత్రాంగం నిషేధం విధించింది. ఈ క్రమంలో, వేసవి సీజన్ ముగియడంతో ఊటీ, పరిసరాల్లో సినిమా షూటింగ్‌లకు అనుమతించినట్లు జిల్లా యంత్రాంగం సోమవారం ప్రకటించింది.

హెచ్‌ఎంల సీనియారిటీ జాబితా విడుదల

ఐసిఎఫ్, జూలై 1: ఆదిద్రావిడ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పనిచేసే ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సీనియారిటీ జాబితాను ఆదిద్రావిడ సంక్షేమ శాఖ డైరెక్టర్ విడుదల చేశారు. ఈ పాఠశాలలో పనిచేసే ప్రధానోపాధ్యాయులకు 2024 మార్చి 21 వరకు వారి అర్హతల ఆధారంగా సీనియారిటీ జాబితా తయారుచేశారు. ఆ ప్రకారం ఎంపికైన 84 మంది ప్రధానోపాధ్యాయుల జాబితా విడుదల చేశారు. జాబితాలో ఏమైనా ఆక్షేపణలుంటే వారం రోజుల్లో తెలియజేయాలని డైరెక్టర్ పేర్కొన్నారు.

రేపు చిన్నారులకు ఉచిత వైద్య శిబిరం

అడయార్, జూలై 1: నగరంలోని శ్రీరామచంద్ర మెడికల్ సెంటర్ ఈ నెల 3వ తేదీ 18యేళ్లలోపు చిన్నారులకు ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసింది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు శ్రీసిటీలోని శ్రీరామచంద్ర హెల్త్ సెంటర్‌లో ఈ శిబిరాన్ని నిర్వహిస్తారు. జ్వరం, జలుబు, దగ్గు, ఆకలి లేమి, బరువు పెరగకపోవడం, శ్వాస సమస్యలతో బాధపడే చిన్నారులు వైద్య పరీక్షలు చేయించుకోవచ్చు. వివరాల కోసం 90806 05607 లేదా 085762 93329 అనే ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చని శ్రీ రామచంద్ర మెడికల్ సెంటర్ సోమవారం విడుదల చేసిన ఒక పత్రికా ప్రకటనలో పేర్కొంది.

రిజిస్ట్రేషన్ శాఖలో కొత్త గైడ్‌లైన్ వ్యాల్యు

అడయార్, జూలై 1: రిజిస్ట్రేషన్ శాఖలో సోమవారం నుంచి న్యూ గైడ్‌లైన్ వ్యాల్యూ (కొత్త మార్గదర్శక విలువ) సోమవారం నుంచి అమల్లోకి వచ్చింది. మార్కెట్ విలువకు అనుగుణంగా దీన్ని పెంచి, రిజిస్ట్రేషన్ చార్జీలను ప్రభుత్వం తగ్గించింది. రాష్ట్ర రిజిస్ట్రేషన్ల శాఖ 2023 ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి న్యూ గైడ్ లైన్ వ్యాల్యూ తీసుకొచ్చింది. దీని ప్రకారం స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ చార్జీలను ప్రజల నుంచి వసూలు చేస్తున్నారు. అయితే, ఈ కొత్త గైడ్ లైన్స్‌లో అనేక లోపాలున్నాయనే విమర్శలు వచ్చాయి. కానీ ప్రభుత్వం మాత్రం ఇవేమీ పట్టించుకోకుండా ఈ కొత్త మార్గదర్శక విలువను జూలై ఒకటో తేదీ నుంచి అమల్లోకి తీసుకొచ్చేందుకే మొగ్గు చూపింది. ఆ ప్రకారంగా న్యూ గైడ్‌లైన్ వ్యాల్యూ సోమవారం నుంచి అమల్లోకి వచ్చింది.

ఐసీఎఫ్ రిటైర్డ్ ఉద్యోగికి ఘన సత్కారం

ప్యారీస్, జూలై 1: స్థానిక పెరంబూరులోని ఐసీఎఫ్‌లో మూడు దశబ్దాలపాటు గ్రేడ్ ఒన్ ఫిట్టర్‌గా పనిచేసిన ఎన్.డేనియల్ ఆదివారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా నిర్వహించిన సత్కార సభలో ఏఐటీఎఫ్ అధ్యక్షుడు ఆచార్య సీఎంకే రెడ్డి, ప్రధాన కార్యదర్శి నందగోపాల్, తమ్మినేని బాబు, గుడిమెట్ల చెన్నయ్య కుటుంబ సభ్యులు, ఐసీఎఫ్ అధికారులు, సహోద్యోగులు పాల్గొని డేనియల్‌కు అభినందనలు తెలియజేశారు.



డేనియల్ సత్కారసభలో సీఎంకే రెడ్డి, తమ్మినేని బాబు కుటుంబ సభ్యులు

ప్రత్యేక వారాంతపు రైళ్ల సేవల పొడిగింపు

పెరంబూర్, జూలై 1: ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక వారాంతపు రైలు సేవలు పొడిగిస్తూ దక్షిణ రైల్వే ప్రకటన విడుదల చేసింది.

- నెం.07695 సికింద్రాబాద్-రామనాథపురం ప్రత్యేక వారాంతపు రైలు (గురువారం) సేవలు ఈ నెల 3 నుంచి 17వ తేది (మూడు సర్వీసులు) పొడిగించారు. అలాగే, నెం.07696 రామనాథపురం-సికింద్రాబాద్ ప్రత్యేక రైలు (శుక్రవారం) సేవలు ఈ నెల 5నుంచి 19వ తేది (మూడు సర్వీసులు) పొడిగించారు.
- నెం.07191 కాచిగూడ-మదురై వారాంతపు ప్రత్యేక రైలు (సోమవారం) సేవలు ఈ నెల 1 నుంచి సెప్టెంబరు 30వ తేది (14 సర్వీసులు) వరకు పొడిగించారు. అలాగే, నెం.07192 మదురై-కాచిగూడ వారాంతపు ప్రత్యేక రైలు (గురువారం) ఈ నెల 3 నుంచి అక్టోబరు 2వ తేది (14 సర్వీసులు) పొడిగించారు.
- నెం.07189 హజూర్ సాహిబ్ నాందేడ్-ఈరోడ్ వారాంతపు ప్రత్యేక రైలు (శుక్రవారం) ఈ నెల 5 నుంచి సెప్టెంబరు 27వ తేది (13 సర్వీసులు) పొడిగించారు. అలాగే, నెం.07190 ఈరోడ్-హజూర్ సాహిబ్ నాందేడ్ వారాంతపు ప్రత్యేక రైలు (ఆదివారం) సేవలు ఈ నెల 7 నుంచి సెప్టెంబరు 29వ తేది (13 సర్వీసులు) పొడిగించారు.
- నెం.07435 కాచిగూడ-నాగర్‌కోయిల్ వారాంతపు ప్రత్యేక రైలు (శుక్రవారం) సేవలు ఈ నెల 5 నుంచి సెప్టెంబరు 27వ తేది (13 సర్వీసులు) పొడిగించారు. అలాగే, నెం.07436 నాగర్‌కోయిల్-కాచిగూడ వారాంతపు ప్రత్యేక రైలు (ఆదివారం) సేవలు ఈ నెల 7 నుంచి సెప్టెంబరు 29వ తేది (13 సర్వీసులు) పొడిగించారు.
- నెం.07153 నరసాపూర్- బెంగుళూరు వారాంతపు ప్రత్యేక రైలు (కాట్పాడి, జోలార్‌పేట) (శుక్రవారం) సేవలు ఈ నెల 5 నుంచి ఆగస్టు 9వ తేది (6 సర్వీసులు) పొడిగించారు. అలాగే, నెం.07154 బెంగళూరు-నరసాపూర్ వారాంతపు ప్రత్యేక రైలు (శనివారం) సేవలు ఈ నెల 5 నుంచి ఆగస్టు 10వ తేది (6 సర్వీసులు) పొడిగించారు.

లాటరీ టిక్కెట్లు విక్రయిస్తున్న నలుగురి అరెస్ట్

పెరంబూర్, జూలై 1: నగరంలో లాటరీ టిక్కెట్లు విక్రయిస్తున్న నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. రాయపురం సిమెట్రీ రోడ్డు అన్నా పార్క్ సమీపంలో కొందరు ఆటో డ్రైవర్లు ఆన్‌లైన్‌లో నిషేధిత లాటరీ టిక్కెట్లు విక్రయిస్తున్నట్లు రాయపురం పోలీసులకు సమాచారం అందింది. ఆదివారం ఆ ప్రాంతంలో తనిఖీలు చేపట్టిన పోలీసులు, లాటరీ టిక్కెట్లు విక్రయిస్తున్న పాత వాషర్‌మెన్‌పేటకు చెందిన రమేష్, రాయపురం సిమెట్రీ రోడ్డుకు చెందిన సమీయుల్లా, కొడుంగైయూర్ ముత్తమిళ్ నగర్‌కు చెందిన జగదీశన్, పాత వాషర్‌మెన్‌పేట ఎన్ఎన్ గార్డెన్ 1వ వీధికి చెందిన మహేంద్రన్‌లను అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.6,680 నగదు, 4 సెల్‌ఫోన్లు, ఒక ఆటో స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ చేసిన వారిని కోర్టులో హాజరుపరచి రిమాండ్ నిమిత్తం జైలుకు తరలించినట్లు నగర పోలీసు శాఖ ప్రకటనలో తెలియజేసింది.

వైద్యుల వేతనం పెంచాలి

- ప్రేమలత డిమాండ్

ప్యారీస్, జూలై 1: ప్రభుత్వాస్పత్రుల్లో రోగులకు చికిత్సలందిస్తున్న వైద్యుల వేతనం పెంచాలని డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత డిమాండ్ చేశారు. ప్రపంచ వైద్యుల దినోత్సవం సందర్భంగా సోమవారం ఆమె వైద్యులందరికి శుభాకాంక్షలు తెలుపుతూ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ వైద్యులకు తక్కువ వేతనం ఇవ్వడం విచారకరమని, వేతనం పెంపు కోసం వైద్యులు కొన్నేళ్లుగా పోరాటాలు చేస్తున్నారని తెలిపారు. 2019వ సంవత్సరం వైద్యుల పోరాటానికి మద్దతు తెలిపిన అప్పటి ప్రతిపక్షనేత, ముఖ్యమంత్రి స్టాలిన్, వారికిచ్చిన హామీ నెరవేర్చలేదన్నారు. ఈ మూడున్నరేళ్ల డీఎంకే పాలనలో వైద్యుల శ్రమను పాలకులు గుర్తించలేదని, మద్రాసు హైకోర్టు ఆరు నెలల్లోపు వైద్యుల వేతనం పెంచాలని జారీచేసిన ఉత్తర్వులను కూడా ఇప్పటివరకు అమలుచేయకపోవడం ఖండించదగ్గదని ఆమె తెలిపారు.

సత్తువాచ్చేరిలో వైద్యశిబిరం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

ప్యారీస్, జూలై 1: చిన్నారుల్లో విటమిన్-ఏ లోపాన్ని అడ్డుకొనేలా ప్రత్యేక వైద్యశిబిరాన్ని సోమవారం సత్తువాచ్చేరిలో కలెక్టర్ సుబ్బులక్ష్మి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ... ఈ శిబిరాలు ఈనెల 31వ తేది వరకు ఉప ఆరోగ్య కేంద్రాలు, అంగన్వాడీ కేంద్రాల్లో జరుగుతాయన్నారు. ఈ శిబిరాల్లో 6 నెలల నుంచి 5 ఏళ్లలోపున్న 95,633 మంది పిల్లలకు జింక్ మాత్రలు, ఓఆర్ఎస్ అందించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కార్తికేయన్, మండల కమిటీ అధ్యక్షుడు నరేంద్రన్, కౌన్సిలర్ శేఖర్, ఆరోగ్యశాఖ ఉప డైరెక్టర్ భానుమతి, కార్పొరేషన్ ఉప కమిషనర్ శశికళ, కార్పొరేషన్ సంక్షేమ అధికారి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల ఆందోళన



వేలూరు, జూలై 1: తమిళనాడు ప్రాథమిక విద్య ఉపాధ్యాయుల సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ప్రధాన విద్యాధికారి కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు ప్రమోషన్, డీఎంకే ఎన్నికల మేనిఫెస్టోలో ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీల అమలు తదితరాలు నెరవేర్చాలని ఆందోళనలో ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమాఖ్య జిల్లా ఆర్గనైజర్లు సురేష్‌కుమార్, సీత, రాజన్, శరవణన్, కోటీశ్వరన్, తమిళనాడు ఉన్నత పాఠశాల టెక్నికల్ విద్య ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జనార్థనన్, సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శన్ సహా పెద్దసంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తిరుచ్చి, కోవైలో స్టార్టప్ కేంద్రాలు

ఐసిఎఫ్, జూలై 1: తిరుచ్చి, కోయంబత్తూర్‌లో స్టార్టప్ కేంద్రాలు ఏర్పాటుచేయనున్నట్లు స్టార్టప్ టీఎన్ మేనేజింగ్ డైరెక్టర్ శివరాజ రామనాథన్ తెలిపారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన ప్రకటనలో... సూక్ష్మ, చిన్న, మధ్యతరహా వృత్తుల శాఖ సబ్సిడీతో దివ్యాంగులు, హిజ్రాలను ప్రోత్సహించేలా స్టార్టప్ కేంద్రాలు ఏర్పాటుచేస్తుమని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం తిరుచ్చి, కోవై నగరాల్లో వీటిని ఏర్పాటుచేస్తున్నామన్నారు.

నీటి నాణ్యతపై ఇంటింటా పరిశీలన



సైదాపేటలోని ఓ ఇంటిలో నీటి నాణ్యత పరిశీలిస్తున్న అధికారి

చెన్నై, జూలై 1 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ వైద్యవిభాగం అధికారులు, సిబ్బంది సోమవారం ఉదయం నుంచి నగరమంతా ఇంటింటా నీటి నాణ్యత పరీక్షలు ప్రారంభించారు. ఇటీవల సైదాపేటలో తాగునీటిలో మురుగునీరు కలిసిన కారణంగా ఆ నీరు తాగి ఓ బాలుడు మృతి చెందిన సంఘటన దరిమిలా నగరమంతటా నీటి నాణ్యతను పరిశీలించాలని అధికారులు నిర్ణయించారు. పూండి, పుళల్, చెంబరంబాక్కం సహా ఐదు రిజర్వాయర్ల నుండి వస్తున్న నీటిని శుద్ధీకరించి 15 జోన్లలో సరఫరా చేస్తున్నారు. అలా సరఫరా చేస్తున్న నీటిలో మురుగునీరు కలుస్తోందంటూ నగరంలోని సైదాపేట తదితర ప్రాంతాల నుంచి ఫిర్యాదులు వచ్చాయి. దీంతో కార్పొరేషన్ అధికారులు, మెట్రోవాటర్ బోర్డు సూపరింటెండెంట్లు సోమవారం నుంచి నీటి నాణ్యత పరిశీలన ప్రారంభించారు. ఈ పరిశీలన రెండు నెలలపాటు జరుగుతుందని అధికారులు చెప్పారు. ప్రతిఇంటికీ వెళ్ళి ఆ ఇంటిలోనివారు తాగుతున్న నీటి నాణ్యత పరిశీలిస్తున్నారు. ప్రభుత్వ గుర్తింపుకార్డులు కలిగిన వాటర్‌బోర్డు సూపరింటెండెంట్లు, కార్పొరేషన్ అధికారులు ఇంటిలో నీటి నాణ్యత పరిశీలించేందుకు వస్తే అనుమతించాలని కార్పొరేషన్ ఉన్నతాధికారులు నగరవాసులకు విజ్ఞప్తి చేశారు.

60 టికెట్ బండిళ్ల చోరీ

ఐసిఎఫ్, జూలై 1: తిరువళ్లూర్ బస్సు డిపోలో 60 టికెట్ బండిళ్లు చోరీకి గురయ్యాయి. ఈ బస్టాండ్‌కు ఆదివారం ఉదయం రెడ్‌హిల్స్ నుంచి రూట్ నెం.505 అనే రెండు ప్రభుత్వ బస్సులు వచ్చాయి. ఈ బస్సులను కన్నన్, శివకుమార్ నడపగా, కండక్టర్లు శేఖర్, దామోదరన్ విధుల్లో ఉన్నారు. ఒకదాని పక్కన ఒకటి నిలిపిన కండక్టర్లు, డ్రైవర్లు టైం కీపర్ దగ్గరకు వెళ్లి సమయాన్ని నమోదుచేసి తిరిగొచ్చారు. ఓ బస్సుల్లోని డ్రైవర్ సీటు దగ్గర బ్యాగులో ఉంచిన రూ.12, రూ.15, రూ.41కలిపి రూ. లక్ష విలువైన 60 టికెట్ బండిళ్లు గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసునమోదుచేసి విచారణ జరుపుతున్నారు.

25 శాతం పెరిగిన ఆవిన్ విక్రయాలు

ఐసిఎఫ్, జూలై 1: రాష్ట్రంలో ఆవిన్ పాల విక్రయాలు 25 శాతం పెరిగినట్లు అధికారులు తెలిపారు. యూనియన్ ప్రాంతాల్లో మాత్రమే 36 లీటర్ల పాలను ఆవిన్ కొనుగోలు చేస్తోంది. 40 లక్షల లీటర్ల పాల కొనుగోలు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఆవిన్ పాల విక్రయాలు 25 శాతం పెరిగాయని, దివ్యాంగులు, నిరుద్యోగులు, హిజ్రాలకు ఆవిన్ పార్లర్లు నడిపేందుకు అనుమతిస్తున్నామని, ఇందుకోసం అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని అధికారులు తెలిపారు.

రూ.31 తగ్గిన వాణిజ్య సిలిండర్ ధర

పెరంబూర్, జూలై 1: వాణిజ్య వినియోగ సిలిండర్ ధర రూ.31 తగ్గింది. అంతర్జాతీయ స్థాయిలో ముడిచమురు ధరలకు అనుగుణంగా పెట్రోల్, డీజిల్ ధరలు మార్చుకొనేందుకు ఆయిల్ సంస్థలకు కేంద్ర ప్రభుత్వం అనుమతించింది. అలాగే, వంటగ్యాస్ సిలిండర్ ధరలు కూడా మార్చుకొనే అవకాశం కల్పించింది. ఆ ప్రకారం, ప్రతి నెలా అంతర్జాతీయ స్థాయి ధరల ప్రకారం సిలిండర్ ధరలు నిర్ణయిస్తున్నారు. ఈ ప్రకారం, జూలై నెలకు సంబంధించిన గ్యాస్ సిలిండర్ ధరలను ఆయిల్ సంస్థలు సోమవారం ప్రకటించాయి. ఆ ప్రకారం, 19 కిలోల వాణిజ్య సిలిండర్ ధర రూ.31 తగ్గి రూ.1,809గా నిర్ణయించాయి. వరుసగా నాలుగు నెలలుగా వాణిజ్య సిలిండర్ ధరలు తగ్గాయి. అదే సమయంలో గృహ వినియోగ సిలిండర్ ధర ఎలాంటి మార్పు లేకుండా 14 కిలోల సిలిండర్ రూ.818.50గానే ఉంది.

అన్నా వర్సిటీ స్నాతకోత్సవానికి మంత్రి పొన్ముడి దూరం?

పెరంబూర్, జూలై 1: అన్నా విశ్వవిద్యాలయ స్నాతకోత్సవాన్ని రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి పొన్ముడి బహిష్కరించనున్నట్లు సమాచారం. అన్నా వర్సిటీ 44వ స్నాతకోత్సవం మంగళవారం జరుగనుంది. ఈ వేడుకలకు వర్సిటీ చాన్సలర్, గవర్నర్ ఆర్ఎన్ రవి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. ఈ వేడుకలను మంత్రి పొన్ముడి బహిష్కరించనున్నట్లు తెలిసింది. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న సేలం విశ్వవిద్యాలయం ఉపకులపతి జగన్నాథన్ పదవీకాలాన్ని గవర్నర్ పొడిగించడాన్ని నిరసిస్తూ మంత్రి ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

కార్పొరేషన్‌కు మాజీ ఉద్యోగి వితరణ





పెరంబూర్, జూలై 1: మదురై కార్పొరేషన్‌లో పనిచేస్తూ పదవీవిరమణ పొందిన కార్మికుడు, కార్పొరేషన్‌కు టాటా ఏస్ వాహనం, మురుగునీరు తొలగించేందుకు వినియోగించే పైపులు, మోటారు విరాళంగా అందజేశారు. రాష్ట్రంలో చెన్నై కార్పొరేషన్ తర్వాత అతి పెద్దదైన మదురై కార్పొరేషన్‌లో ఐదు మండలాలుండగా, సుమారు 6 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. కార్పొరేషన్ మధ్య మండల డిప్యూటీ కమిషనర్ డ్రైవర్‌గా 32 ఏళ్లు పనిచేసిన జి.మనోహరన్ గత నెల 30న పదవీవిరమణ చేశారు. ఆయన సోమవారం కుటుంబంతో పాటు మేయర్ ఇంద్రాణిని కలుసుకొని, కార్పొరేషన్‌లో పారిశుధ్య వాహనాల సంఖ్య తక్కువగా ఉందని, అందువల్ల తన సొంత ఖర్చుతో టాటా ఏస్ వాహనం, మురుగునీరు తొలగించే పైపులు, మోటారు అందజేశారు. మనోహరన్‌ను కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది అభినందించారు.

హెచ్‌ఎంకే నిర్వాహకుల సమావేశం



ప్రసంగిస్తున్న గోపినాథ్

వేలూరు, జూలై 1: స్థానిక అన్నా సాలైలోని ఏలగిరి హాలులో సోమవారం హిందూ మున్నేట్ర కళగం నిర్వాహకుల సమావేశం జరిగింది. సమావేశానికి జిల్లా కోట అధ్యక్షుడు శక్తివానన్, రాష్ట్ర సెక్రటరీ అన్బయగన్, హరికృష్ణన్ పాల్గొనగా, ముఖ్యఅతిథిగా రాష్ట్ర అధ్యక్షుడు గోపినాథ్ పాల్గొన్నారు. సమావేశంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, కళగం అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ ఎంపిక జరిగింది.

రైలు ఢీకొని ఇద్దరు మృతి

పెరంబూర్, జూలై 1: తిరుప్పూర్ జిల్లా కావిలిపాళయం ప్రాంతంలో రైలు పట్టాలు దాటేందుకు యత్నించిన ఇద్దరు రైలు ఢీకొని మృతిచెందారు. కుడవాసల్ ప్రాంతానికి చెందిన రాజ్‌కుమార్, శరవణకుమార్ భవన నిర్మాణ కార్మికులుగా పనిచేస్తున్నారు. వారు సోమవారం ఉదయం 5 గంటల ప్రాంతంలో టీ తాగి రైలు పట్టాలు దాటుతున్న సమయంలో రైలు ఢీకొని ఇద్దరూ సంఘటనా స్థలంలోనే మృతిచెందారు. ఈ ఘటనపై రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

గంజాయి పెంచిన సిద్ధ వైద్యుడి అరెస్టు

పెరంబూర్, జూలై 1: తోటలో గంజాయి మొక్కలు పెంచుతున్న సిద్ధ వైద్యుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. కళ్లకుర్చి కల్తీ సారా ఘటనపై స్పందించిన పోలీసు, ఎక్సైజ్ శాఖలు రాష్ట్రవ్యాప్తంగా కల్తీ సారా తయారీ, విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించాయి. ఈ క్రమంలో, ఈరోడ్ జిల్లా గోపి సమీపంలోని ఎలాత్తూర్ సెట్టిపాళయం ప్రాంతంలోని ఓ తోటలో గంజాయి సాగుచేస్తున్నట్లు ఈరోడ్ ఎక్సైజ్ అధికారులకు సమాచారం అందింది. ఆ ప్రాంతంలో తనిఖీలు జరిపిన పోలీసులు, ఔషధ మొక్కల మధ్యలో గంజా సాగుచేస్తున్నట్లు గుర్తించారు. ఈ వ్యవహారంలో కేసు నమోదుచేసిన పోలీసులు, తోట యజమాని, సిద్ధ వైద్యుడు మారప్పన్ (80), ఆయన కుమారుడు కరుప్పుస్వామి (45)లను అరెస్ట్ చేశారు. అలాగే, తోటలో పెంచుతున్న 11గంజాయి మొక్కలను ధ్వంసం చేశారు.

రాష్ట్రంలో పలువురు ఐఏఎస్‌ల బదిలీ

ప్యారీస్, జూలై 1: ప్రజాపనులు, జలవనరులు, ఆరోగ్య తదితర కీలక శాఖల ఐఏఎస్ అధికారులను సోమవారం రాష్ట్రప్రభుత్వం బదిలీ జారీచేసింది. సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్‌మీనా జారీచేసిన ప్రకటనలో... రాష్ట్ర పర్యాటక అభివృద్ధి శాఖ కార్యదర్శిగా పనిచేస్తున్న కె.మణివాసన్ జలవనరుల శాఖ కార్యదర్శిగా నియమితులయ్యారు. ప్రజాపనుల శాఖ కార్యదర్శిగా పనిచేస్తున్న డా.చంద్రమోహన్ పర్యాటక శాఖకు బదిలీ అయ్యారు. పశు సంవర్థక, పాల అభివృద్ధి, మత్స్య, జాలర్ల సంక్షేమ శాఖ కార్యదర్శి మంగత్ రామ్ శర్మ ప్రజాపనుల శాఖకు బదిలీ అయ్యారు. గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి డా.సెంథిల్‌కుమార్ పర్యావరణ శాఖ కార్యదర్శిగా, అటవీ శాఖ కార్యదర్శి సుప్రియ సాహు ఆరోగ్యశాఖకు బదిలీ అయ్యారు. ఆ శాఖ కార్యదర్శిగా పనిచేస్తున్న గగన్‌దీప్‌సింగ్ బేదీ పంచాయతిరాజ్ కార్యదర్శిగా బదిలీ అయ్యారు. ప్రధాన రహదారులు, చిన్న ఓడరేవుల శాఖ కార్యదర్శి ప్రదీప్‌యాదవ్ ఉన్నత విద్య శాఖకు, రహదారుల శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సెల్వరాజ్ ఆ శాఖ కార్యదర్శిగా నియమితులయ్యారు. తమిళనాడు ప్రభుత్వ కేబుల్ టీవీ మేనేజింగ్ డైరెక్టర్ జాన్ లూయిస్ సామాజిక సాంఘిక శాఖ డైరెక్టర్‌గా, హౌసింగ్, గ్రామీణాభివృద్ధి శాఖ అదనపు కార్యదర్శి విజయలక్ష్మి హోమియోపతి డైరెక్టర్‌గా, ఎయిడ్స్ కంట్రోల్ బోర్డు ప్రాజెక్ట్ డైరెక్టర్ హరిహరన్ భూముల నిర్వహణ సవరణల శాఖ కమిషనర్‌గా, నగర పాలక తాగునీటి సరఫరా శాఖ మెంబర్ సెక్రటరీగా ఉన్న లిల్లీ రవాణా శాఖ ప్రత్యేక కార్యదర్శిగా, జలవనరుల శాఖ కార్యదర్శి సందీప్ సక్సేనా తమిళనాడు పేపర్ కర్మాగారాల చైర్మెన్‌గా, మేనేజింగ్ డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు. పరిశ్రమల పెట్టుబడుల సంస్థ చైర్మెన్ మహేశ్వరన్ తమిళనాడు సాల్ట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు. సమాచార శాఖ డైరెక్టర్‌గా పనిచేసిన వైద్యనాధన్ కేబుల్ టీవీ కార్పొరేషన్ చైర్మెన్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తారు. వ్యవసాయ శాఖ ఆధునికీకరణ ప్రాజెక్ట్ డైరెక్టర్ జవహర్ సామాజిక సంస్కరణల శాఖ కార్యదర్శిగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తారని శివదాస్ మీనా తన ఉత్తర్వుల్లో తెలిపారు.

పసిబిడ్డను హతమార్చిన తండ్రి

పెరంబూర్, జూలై 1: ఐదు నెలల చిన్నారి ఏడుస్తూ ఉండడంతో ఓ తండ్రి కోపంతో చిన్నారిని హతమార్చిన ఘటన నీలగిరి జిల్లాలో చోటుచేసుకుంది. ఓల్డ్ ఊటీ ప్రాంతానికి చెందిన కొరియర్ ఉద్యోగి ప్రేమ్, రమ్య దంపతులకు ఐదు నెలల ఏంజెల్ అనే కుమార్తె ఉంది. ఉదయం 7 గంటలకు విధులకు వెళ్లే ప్రేమ్ రాత్రి 9 గంటలకు ఇంటికి వస్తుంటాడు. ఈ నేపథ్యంలో, శనివారం ఉదయం 9 గంటలకు ప్రేమ్ డ్యూటీకి వెళ్లాడు. ఇంట్లో నిద్రపోతున్న ఏంజెల్ ఎంతకీ లేకపోవడంతో వంట గదిలో పనిచేస్తున్న రమ్య ఆమె వద్దకు వచ్చి చూడగా, ఉలుకు పలుకు లేకుండా ఉండడంతో దిగ్భ్రాంతి చెంది బిగ్గరగా కేకలు వేసింది. చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకొని చిన్నారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించగా, అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. కుమార్తె మృతిపై సందేహించిన రమ్య ఊటీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఇన్‌స్పెక్టర్ మురళీధరన్, ఎస్ఐ సురేష్‌కుమార్ పలు కోణాల్లో కేసు విచారించి ప్రేమ్‌ను అదుపులోకి తీసుకొన్నారు. కుమార్తె ఏంజెల్ ఎప్పుడూ ఏడుస్తుండడంతో ప్రేమ్ కోప్పడేవాడని రమ్య అతడిని వారించేదని తెలిపింది. శనివారం ఉదయం రమ్య దుస్తులు ఆరేసేందుకు బయటకు వెళ్లగా ప్రేమ్ ఇంట్లో ఉన్నాడు. ఆ సమయంలో ఏంజెల్ బిగ్గరగా ఏడుస్తుండడతో ఆమెను ఓదార్చేందుకు ప్రేమ్ ప్రయత్నించినా ఆమె ఏడుపు ఆపలేదు. దీంతో ఆగ్రహం చెందిన ప్రేమ్, కుమార్తెను కొట్టినట్లు తెలిసింది. ఆ దెబ్బకు మెదడుకు వెళ్లే నరం చిట్లడంతో చిన్నారి మృతిచెందినట్లు తెలిసింది. దీంతో, ప్రేమ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు.

అదనపు ఉపాధ్యాయుల బదిలీల్లో నిబంధనలు

ఐసిఎఫ్, జూలై 1: ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల్లో అదనంగా ఉన్న ఉపాధ్యాయులను ఇతర జిల్లాలకు బదిలీ చేసేందుకు పాఠశాల విద్యాశాఖ నిబంధనలు విడుదల చేసింది. ఆ ప్రకారం, మైనారిటీ ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేసే అదనపు ఉపాధ్యాయులు ఆ నిర్వాహకం కింద పనిచేసే ఇతర పాఠశాలలు, ఇతర ఎయిడెడ్ మైనార్టీ పాఠశాలలకు బదిలీ కావచ్చు. అక్కడ ఖాళీ లేని పక్షంలో జిల్లా పరిధిలోనే అవసరమయ్యే ప్రభుత్వ పాఠశాలలకు బదిలీ కావచ్చు. ఆ పాఠశాలల్లోనూ అదనపు ఉపాధ్యాయులుంటే దగ్గర్లో ఉన్న ఇతర ప్రభుత్వ పాఠశాలలు, ఎయిడెడ్ పాఠశాలల్లో నియమించవచ్చు. అలా నియమితులైన వారిని ఇదివరకే పనిచేసిన పాఠశాలలో పోస్టులు ఖాళీ అయితే మళ్లీ అదే పాఠశాలకు బదిలీ చేయవచ్చు. మైనార్టీ హోదా పొందిన పాఠశాలల్లో ఉన్న అదనపు ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి కూడా పాఠశాల విద్యాశాఖ నిబంధనలు జారీచేసింది.

త్వరలో శశికళతో భేటీ : ఓపీఎస్

పెరంబూర్, జూలై 1: అన్నాడీఎంకే పార్టీని ఒకటిగా చేయడమనే లక్ష్యమని, అందుకోసం అవసరమైతే శశికళతో భేటీ అవుతానని మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం తెలిపారు. నగరం నుంచి సోమవారం ఉదయం ఆయన మదురై బయల్దేరారు. ఈ సందర్భంగా విమానాశ్రయంలో మీడియాతో మాట్లాడుతూ... వర్గాలుగా విడిపోయిన అన్నాడీఎంకే ఒకటిగా ఉండాలని కార్యకర్తలు కోరుకుంటున్నారన్నారు. కార్యకర్తల అభీష్టం మేరకు పార్టీని ఒకటిగా చేసే చర్యలు చేపట్టామన్నారు. అందుకు అవసరమైతే తగిన సమయంలో శశికళతో భేటీ అవుతానని పన్నీర్‌సెల్వం తెలిపారు.

రేపటికి సెంథిల్ బాలాజీ కేసు వాయిదా

పెరంబూర్, జూలై 1: మాజీ మంత్రి సెంథిల్ బాలాజీ కేసు విచారణ ఈ నెల 3వ తేదీకి వాయిదాపడింది. తనపై తప్పుడు ఆరోపణలతో ఈడీ దాఖలు చేసిన పిటిషన్ ఉత్తర్వులు కొట్టివేయాలని కోరుతూ సెంథిల్ బాలాజీ తరపున కొత్తగా మూడు పిటిషన్లు దాఖలయ్యాయి. చట్టవ్యతిరేక నగదు బట్వాడా కేసు నుంచి విడుదల చేయాలని కోరుతూ సెంథిల్ బాలాజీ ఇదివరకే పిటిషన్ వేశారు. ఈ కేసు సోమవారం విచారణకు రాగా, కేసు విచారణ జాప్యం చేయించాలనే ఉద్దేశంతోనే ఆయన కొత్త పిటిషన్లు దాఖలుచేస్తున్నారని ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం న్యాయవాది ఆరోపించారు. ఈ నేపథ్యంలో, సెంథిల్ బాలాజీ తరపు వాదనలు వినిపించేలా ఈనెల 3వ తేదీకి కేసు విచారణ వాయిదావేస్తూ చెన్నై ప్రిన్సిపల్ సెషన్స్‌కోర్టు ఉత్తర్వులు జారీచేసింది.

పాఠశాల కమిటీలకు సభ్యులను నియమించండి

ఐసిఎఫ్, జూలై 1: పాఠశాల నిర్వహణ కమిటీలకు కొత్త సభ్యులను ఎంపిక చేయాలని పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుల పదవీ కాలం ఇటీవల ముగిసింది. ఈ నేపథ్యంలో, కొత్త సభ్యుల ఎంపికకు చర్యలు చేపట్టాలని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది.

జలవనరుల శాఖకు కొత్త ఇంజనీర్ నియామకం

ఐసిఎఫ్, జూలై 1: జలవనరుల శాఖలో ప్రధాన ఇంజనీర్ సహా వివిధ పోస్టుల్లో కొత్త అధికారులు నియమితులయ్యారు. ఈ శాఖలో ప్రధాన ఇంజనీర్ అశోకన్, ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి మురుగన్, ప్రధాన ఇంజనీర్లు సురేష్, సుబ్రమణ్యం సహా 19 మంది పదవీవిరమణ చేశారు. దీంతో, ఆ శాఖ ప్రధాన ఇంజనీర్‌గా మన్మధన్, రాష్ట్ర జలవనరుల అభివృద్ధి ఏజెన్సీ ప్రధాన ఇంజనీర్‌గా గోపాలకృష్ణన్, తిరుచ్చి మండల జలవనరుల శాఖ ప్రధాన ఇంజనీర్‌గా దయాళకుమార్, కోవై మండల జలవనరుల శాఖ ప్రధాన ఇంజనీర్‌గా మురుగేశన్ నియమితులయ్యారు.

భర్త మృతిని తట్టుకోలేక గర్భిణి ఆత్మహత్య

పెరంబూర్, జూలై 1: భర్త మృతిచెందిన రెండు రోజుల్లోనే ఓ గర్భిణి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న విషాద సంఘటన తిరువణ్ణామలైలో చోటుచేసుకుంది. తిరువణ్ణామలై జిల్లా కలశపాక్కం సమీపం సోరకొళత్తూర్ గ్రామానికి చెందిన పోలీసు అజిత్‌కుమార్‌కు పుదుచ్చేరి ప్రాంతానికి చెందిన దివ్యభారతి (23)తో వివాహమై సర్వేష్ (1) అనే కుమారుడున్నాడు. ప్రస్తుతం దివ్యభారతి నాలుగు నెలల గర్భిణి. ఈ క్రమంలో, గత నెల 28వ తేది అజిత్ కుమార్ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భర్త మృతి చెందినప్పటి నుంచి దివ్యభారతి ఎవరితో మాట్లాడకుండా విషాదంగా ఉంటున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో, ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో దివ్యభారతి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై కలశపాక్కం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

బైక్ రేసుల్లో 12 మంది మైనర్లు

- తల్లిదండ్రులకు జరిమానా

పెరంబూర్, జూలై 1: కన్నియాకుమారి జిల్లా కుళచ్చల్-నాగర్‌కోయిల్ ప్రధాన రోడ్లలపై కొందరు బాలురు బైక్ రేస్ నిర్వహించి, ఆ దృశ్యాలు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారు. ఈ వ్యవహారంపై దృష్టి సారించిన కుళచ్చల్ ట్రాఫిక్ పోలీసులు ఆ వీడియోలు పరిశీలించారు. అందులో బైక్ రేస్‌లో పాల్గొన్న 12 మంది బాలురను గుర్తించి ఏడు బైక్ సహా వారిని అదుపులోకి తీసుకున్నారు. బాలుల తల్లిదండ్రులను పోలీస్‌స్టేషన్‌కు రప్పించి హెచ్చరించడంతో పాటు రూ.11,000 వేలు జరిమానా విధించారు.

పెరియార్ వర్సిటీ ప్రొఫెసర్లు - కార్మిక సంఘాల భేటీ

- వీసీ జగన్నాథన్‌కు వ్యతిరేకంగా తీర్మానం

అడయార్, జూలై 1: అనేక అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న సేలంలోని పెరియార్ విశ్వవిద్యాలయం ఉపకులపతి జగన్నాథన్ పదవీకాలాన్ని మరో యేడాది పొడగిస్తూ రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్.రవి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిర్ణయంపై వర్సిటీ ప్రొఫెసర్లు, ఉద్యోగులు, కార్మిక సంఘాల నేతలు భగ్గున మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ సంఘాల ప్రతినిధులు సోమవారం కీలక సమావేశం నిర్వహించారు. ప్రొఫెసర్ల సంఘం అధ్యక్షుడు వైద్యనాథన్, కార్మిక ఉద్యోగ సంఘ అధ్యక్షుడు కనివణ్ణన్, ప్రధాన కార్యదర్శి శక్తివేల్‌లతో పాటు ఇతర నాయకులు కూడా పాల్గొని, వీసీ జగన్నాథన్ పదవీకాలాన్ని పొడిగిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న జగన్నాథన్ ఉపకులపతి సీటులో కూర్చోరాదంటూ ఆయనకు వ్యతిరేకంగా తీర్మానం చేశారు. గవర్నర్ నిర్ణయానికి నిరసనగా వారం రోజుల పాటు రిలే నిరసన కార్యక్రమాలు చేపట్టాలని ఇప్పటికే నిర్ణయించిన విషయం తెల్సిందే.

సురుళి జలపాతానికి వెళ్లేందుకు నిషేధం

పెరంబూర్, జూలై 1: తేని జిల్లాలోని ప్రముఖ పర్యాటక కేంద్రం సురుళి జలపాతం వద్దకు పర్యాటకులు వెళ్లకుండా అటవీ శాఖ నిషేధం విధించింది. జలపాతం, పరిసర ప్రాంతాల్లో ఏనుగులు సంచరిస్తున్నట్లు అధికారులు భావిస్తున్నారు. ఈ ప్రాంతాలను పరిశీలిస్తున్నామని, ఏనుగుల సంచారం ఉంటే వాటిని అడవుల్లోకి పంపేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పర్యాటకుల భద్రత దృష్ట్యా జలపాతం వెళ్లేందుకు నిషేధం విధించామని, ఏనుగుల సంచారం లేదని తేలితే, పర్యాటకులను అనుమతిస్తామని అధికారులు ఈ సందర్భంగా తెలిపారు.

మెట్రోరైళ్లలో 84.33 లక్షల మంది ప్రయాణం

పెరంబూర్, జూలై 1: నగరంలో నడుపుతున్న మెట్రో రైళ్లలో గత జూన్‌లో 84.33 లక్షల మంది ప్రయాణం చేశారు. ఈ మేరకు చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) ప్రకటన విడుదల చేసింది. అదే మే నెలలో 84,21,072 మంది ప్రయాణించగా, జూన్‌లో 84,33,837 మంది ప్రయాణం చేశారు. జూన్ 21వ తేది అధికంగా 3,27,110 మంది ప్రయాణం చేశారని సీఎంఆర్ఎల్ తెలిపింది.



'విడాముయర్చి' ఫస్ట్‌లుక్

ఆకట్టుకుంటున్న అజిత్

'విడాముయర్చి' ఫస్ట్‌లుక్

అగ్ర హీరో అజిత్ కుమార్ నటిస్తున్న కొత్త చిత్రం 'విడాముయర్చి' షూటింగ్ శరవేగంగా జరుపుకుంటుంది. ఈ నేపథ్యంలో ఈ మూవీ నుంచి ఫస్ట్‌లుక్‌ను చిత్ర నిర్మాణ సంస్థ తాజాగా విడుదల చేసింది. ప్రముఖ నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్ భారీ బడ్జెట్‌తో నిర్మించే ఈ చిత్రానికి మగిళ్ తిరుమేని దర్శకుడు. అజిత్ - తిరుమేని క్రేజీ కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రంపై ఇప్పటి నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా విడుదల చేసిన ఫస్ట్‌లుక్‌లో అజిత్ బ్యాగ్ పట్టుకుని రోడ్డుపై వస్తుండడం చూడొచ్చు. హీరోయిన్‌గా త్రిష నటిస్తుండగా యాక్షన్ కింగ్ అర్జున్ మరో ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. ఆరవ్, రెజీనా కెసాండ్రా, నిఖిల్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్నారు. అనిరుద్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించి చాలా రోజుల తర్వాత అప్‌డేట్ ఇవ్వడంతో అజిత్ ఫ్యాన్స్ ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. అజిత్ కుమార్ నటిస్తున్న 62వ చిత్రంలో ప్రతినాయకుడిగా సంజయ్‌దత్ నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ అజర్‌బైజాన్‌లో శరవేగంగా జరుపుకుంటుంది.

'స్టార్ నైట్' నిర్వహణపై రజనీతో చర్చలు

నడిగర్ సంఘం భవన నిర్మాణం కోసం నిధుల సేకరణ నిమిత్తం ఒక స్టార్ నైట్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఇందుకోసం నడిగర్ సంఘం నిర్వాహకులు చర్యలు చేపట్టారు. ఈ స్టార్ నైట్ కార్యక్రమాన్ని ఎలా నిర్వహించాలి? అనే విషయంపై అగ్ర నటులు కమల్ హాసన్, రజనీకాంత్ నుంచి నడిగర్ సంఘ సభ్యులు సలహాలు సూచనలు స్వీకరిస్తుంది. ఇందులో భాగంగా, ఆ సంఘం కోశాధికారి కార్తీ, ఉపాధ్యక్షులు పూచ్చి మురుగన్, కరుణాస్ సోమవారం హీరో రజనీకాంత్‌ను పోయస్ గార్డెన్‌లోని ఆయన నివాసంలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా స్టార్ నైట్ నిర్వహణపై సూచనలు, సలహాలను రజనీకాంత్‌ను కోరారు. ఈ సందర్భంగా నడిగర్ సంఘం భవన నిర్మాణ పనులు ఎంత వరకు వచ్చాయని సంఘం సభ్యులను అడిగి రజనీకాంత్ అడిగి తెలుసుకున్నారు.



రజనీకాంత్‌తో పూచ్చి మురుగన్, కార్తీ, కరుణాస్

చిత్రజ్యోతి

'తంగలాన్' నుంచి త్వరలో భయపెట్టే ట్రైలర్ : జీవీ ప్రకాష్

చియాన్ విక్రమ్ - పా.రంజిత్ కాంబినేషన్‌లో తెరకెక్కిన 'తంగలాన్' చిత్రం నుంచి త్వరలోనే ప్రతి ఒక్కరినీ భయపెట్టే అద్భుతమైన ట్రైలర్ రాబోతుందని ఆ చిత్ర సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ తెలిపారు. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ పూర్తయిందని ఆయన వెల్లడించారు. ఈ మేరకు జీవీ ప్రకాష్ కుమార్ తన ఎక్స్ హ్యాండిల్‌లో ఓ ట్వీట్ చేశారు. "తంగలాన్' బ్యాక్ గ్రౌండ్ స్కోర్ కంపోజింగ్ పూర్తయింది. ఈ సినిమాకు నా బెస్ట్ ఎఫర్ట్ చేశాను. ఈ అద్భుతమైన చిత్రం కోసం ఎదురు చూస్తున్నా. ప్రేక్షకులను విస్మయానికి గురిచేసే భయంకరమైన, అద్భుతమైన ట్రైలర్ త్వరలోనే విడుదలకానుంది. భారతీయ చిత్రపరిశ్రమ ఈ సినిమా కోసం అమితాసక్తితో ఎదురు చూస్తుంది' అని పేర్కొన్నారు. కాగా, ఈ సినిమాలో చియాన్ విక్రమ్, మాళవిక మోహనన్, పశుపతి తదితరులు నటించారు. కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ నేపథ్యంలో పీరియాడికల్ ఫిల్మ్‌గా ఈ సినిమాను దర్శకుడు పా.రంజిత్ రూపొందించారు. చాలాకాలం క్రితమే షూటింగ్ పూర్తి చేసుకున్నప్పటికీ పలు కారణాల వల్ల సినిమా విడుదలలో జాప్యం నెలకొంది. చివరకు ఆగస్టు 15న ఈ చిత్రాన్ని విడుదల చేసేలా దర్శక నిర్మాతలు ప్లాన్ చేశారు.



'తంగలాన్'లో విక్రమ్

ప్రభుదేవా హీరోగా 'సింగానల్లూరు సిగ్నల్'

ప్రభుదేవా హీరోగా నటిస్తున్న తాజా చిత్రానికి 'సింగానల్లూరు సిగ్నల్' అనే పేరు పెట్టారు. ఈ చిత్రం ప్రారంభోత్సవం సోమవారం నగరంలో సంప్రదాయ పూజా కార్యక్రమంతో ప్రారంభమైంది. ఈ సందర్భంగా విడుదల చేసిన ఈ చిత్ర పోస్టర్ అభిమానులను అమితంగా ఆకట్టుకుంటుంది. ప్రభుదేవా హీరోగా నటించిన 'బగీరా' సినిమా గత యేడాది విడుదలై నెగెటివ్ రివ్యూల కారణంగా పరాయజం పొందింది. అయితే, ప్రభుదేవా మాత్రం 'పేట రాప్', 'ది గోట్' వంటి చిత్రాల్లో నటిస్తుండగా, తాజాగా 'సింగానల్లూరు సిగ్నల్' చిత్రంలో హీరోగా నటిస్తున్నారు. జేఎం రాజా దర్శకత్వం వహించే ఈ చిత్రంలో మలయాళ నటుడు షైన్ టామ్ చాకో ఓ ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. ఇతర పాత్రల్లో శ్రీమాన్, భవ్యత్రిక, అయాజ్ ఖాన్, నిఖిల్ థామస్ కనిపించనున్నారు.



'సింగానల్లూరు సిగ్నల్'లో ప్రభుదేవా

రాష్ట్ర పర్యాటక సంస్థకు కొత్త లగ్జరీ బస్సులు

● జెండా ఊపి ప్రారంభించిన సీఎం స్టాలిన్





టీటీడీసీ కొత్త బస్సులను జెండా ఊపి ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

చెన్నై, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ (టీటీడీసీ) కోసం రూ.3కోట్లతో కొనుగోలు చేసిన ఐదు లగ్జరీ బస్సులకు ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభోత్సవం చేశారు. సచివాలయ ప్రాంగణం వద్ద సోమవారం ఉదయం పర్యాటక శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న సీఎం పచ్చ జెండా ఊపి ఈ బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ ప్రపంచ ప్రసిద్ధి గాంచిన పర్యాటక స్థలాలు, ఆధ్యాత్మిక క్షేత్రాలు రాష్ట్రంలోనే అత్యధికంగా ఉన్నాయని, ఈ ప్రాంతాలకు వెళ్లే పర్యాటకులకు రవాణా సదుపాయాన్ని మెరుగుపరచటంలో భాగంగా కొత్త లగ్జరీ బస్సులు కొనుగోలు చేసినట్లు చెప్పారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి 1971లో ఏర్పాటు చేసిన రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ టూరిస్టు బస్సులు, 'హోటల్ తమిళనాడు' పేరుతో వసతి గృహాలు, 'అముదగం' పేరుతో రెస్టారెంట్లు, బోట్ హౌస్‌లను సమర్థవంతంగా నిర్వహిస్తోందని ప్రశంసించారు. ప్రస్తుతం పర్యాటకుల చక్కటి రవాణా సదుపాయం కల్పించేందుకుగాను రూ. 3 కోట్లతో 35 సీట్ల కెపాసిటీ గలిగిన నాలుగు బస్సులు, 18 సీట్లు కలిగిన బస్సు కలిపి ఐదు కొత్త లగ్జరీ బస్సులు కొనుగోలు చేసినట్లు ఆయన వివరించారు. ఏసీ సదుపాయంతోపాటు ఎయిర్ సస్పెన్షన్, జీపీఎస్ పరికరం, ప్రతిసీటు వద్ద సెల్‌ఫోన్ ఛార్జ్ చేసుకునే సదుపాయం, అతి పెద్ద లగేజీ బాక్స్‌లున్నాయి. ఈ కార్యక్రమంలో మంత్రులు ఉదయనిధి, కే రామచంద్రన్, పర్యాటక, దేవాదాయ శాఖల అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కే మణివాసగన్, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ సి. సమయమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కన్యకా పరమేశ్వరి ఆలయ మహాకుంభాభిషేకం

ప్యారీస్, జూలై 1: కన్యకా పరమేశ్వరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక అంబత్తూర్‌లో నూతనంగా నిర్మించిన కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ మహాకుంభాభిషేకం సోమవారం వైభవంగా జరిగింది. బెంగళూరు వాసవి పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతి స్వామి ఉదయం గర్భాలయంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు జరిపి మహాగణపతి పూజతో మహా సంప్రోక్షణ క్రతువు ప్రారంభించారు. ట్రస్ట్ చైర్మెన్ అజంతా డా.కనిగెలుపుల శంకరరావు,విజయలక్ష్మి దంపతుల పర్యవేక్షణలో తెల్లవారుజామున 5 గంటలకు ఐదవ జాము యాగపూజ, గోపూజ, కంకణధారణ, కలశ పూజ, ప్రాణ ప్రతిష్ఠ, కలాహోమాలు నిర్వహించారు. వాసవాంబ, గణపతి ఉపనిషత్తు పారాయణం, అష్టగణపతి మూలమంత్ర హోమం, మహా పూర్ణాహుతితో ఆలయ అర్చకులు ఈ నెల 28 నుంచి యాగశాల పూజలను పూర్తి చేశారు. సోమవారం ఉదయం 7 గంటలకు మూలవర్లకు అభిషేకం, పరివారదేవతలు, ఆలయ గోపురకలశాలలకు మహా కుంభాభిషేకాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించిన కన్యకా పరమేశ్వరి, శివపార్వతులు, విఘ్నేశ్వరుడు, వల్లి దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి, షిర్డీ సాయిబాబా విగ్రహాలకు సచ్చిదానంద సరస్వతి స్వామి నేతృత్వంలో మహాకుంభాభిషేకం జరిగింది. ఈ ఆలయ ప్రాంగణంలో నవగ్రహాలు సమీసమేతంగా కొలువై ఉండడం విశేషం. ఈ సందర్భంగా అజంతా శంకరరావు మాట్లాడుతూ... కన్యకా పరమేశ్వరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వాసవి మాత ఆలయాలు లేని ప్రాంతాల్లో నూతనఆలయాలు నిర్మించాలన్న సంకల్పంతో మొదటి సారిగా అంబత్తూర్ ఆర్యవైశ్య సంఘానికి రూ.2 కోట్లతో ఆలయాన్ని నిర్మించి మహాకుంభాభిషేకాన్ని విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ఇందుకు సహకరించిన పలువురు దాతలు, ఆలయ కమిటీ నిర్వాహకులు, వైశ్యసంఘాల నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. 2022 అక్టోబరులో ఈ ఆలయానికి శంకుస్థాపన చేసి, రెండేళ్ల వ్యవధిలోనే అమ్మవారి ఆలయాన్ని అద్భుత శిల్పకళా నైపుణ్యంతో నిర్మించగలిగామని ఆయన వివరించారు. కార్యక్రమంలో పెనుగొండకు చెందిన నూలి వెంకటరమణమూర్తి, జీఏ మ్మార్ గ్రూప్ డైరెక్టర్ బొమ్మిడాల మణిసంతోష్, తారణ, అపోలో సుబ్రమణ్యం, పువ్వాడ శేషాద్రి, ఇ.బాలాజి, అంబత్తూర్ ఆర్యవైశ్య సంఘ సభ్యులు పాల్గొన్నారు. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, కర్ణాటక రాష్ట్రాల నుంచి విచ్చేసిన భక్తులందరికి ప్రసాదాలు పంపిణీ చేశారు.





ఆలయ ప్రధాన గోపుర కలశ పూజలో మణిసంతోష్, అజంతా శంకరరావు తదితరులు - నవగ్రహాలకు అభిషేకం నిర్వహిస్తున్న సచ్చిదానంద సరస్వతి స్వామి

నారాయణి పీఠంలో ముగిసిన లలితా సహస్రనామ పారాయణం

వేలూరు, జూలై 1: ప్రపంచ క్షేమం, ప్రకృతి అభివృద్ధి కోరుతూ శ్రీ పురం నారాయణి పీఠంలో లలితా సహస్రనామ పారాయణ సహిత యాగం మూడు సంవత్సరాల క్రితం ప్రారంభించారు. 2021 అక్టోబరు 6వ తేది శక్తి అమ్మ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వెయ్యి రోజులపాటు సాగిన ఈ కార్యక్రమంలో భాగంగా సోమవారం లలితా సహస్రనామ యాగం పూర్ణాహుతి జరిగింది. కార్యక్రమంలో భాగంగా ప్రతిరోజు గోపూజ, తులసి పూజ, సూర్య పూజ, గజ పూజ, అశ్వ పూజ 9 గంటలు నిర్వహించారు. కార్యక్రమం ముగింపు వేడుకల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనగా, శక్తి అమ్మ వారిని ఆశీర్వదించారు.



పూర్ణాహుతి చేస్తున్న శక్తి అమ్మ

పిల్లలకు ఓఆర్ఎస్, జింక్ మాత్రల పంపిణీ

● ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం

పెరంబూర్, జూలై 1: అంగన్వాడీ కేంద్రాల ద్వారా 1 నుంచి ఐదేళ్లలోపున్న పిల్లలకు ఓఆర్ఎస్, 14 జింక్ మాత్రలు అందించనున్నట్లు ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం తెలిపారు. అడయార్ జోన్ కన్నికాపురం శిశుసంరక్షణ కేంద్రంలో సోమవారం ఉదయం చిన్నారులకు విటమిన్ ఏ ద్రవం, ఓఆర్ఎస్ మిశ్రమం కలిగిన కిట్లను పంపిణీ చేశారు. ఆ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ... సైదాపేటలో శుద్ధీకరించిన తాగునీరందించేలా చర్యలు చేపట్టామన్నారు. ఈ ప్రాంతంలో తాగునీటిలో మురుగునీరు కలసి చిన్నారి మృతిచెందాడనే వార్తలపై మంత్రి స్పందిస్తూ, ఈ ప్రాంతంలో మరెవరూ అనారోగ్యానికి గురికాలేదన్నారు. ఆ ప్రాంతంలోని అన్ని ఇళ్లను పరిశీలించామన్నారు. సైదాపేటలో బాలుడి మృతికి సంబంధించిన మెడికల్ రిపోర్ట్ మరో రెండు రోజుల్లో రానుందని తెలిపారు. సైదాపేట ప్రాంతంలో సోమవారం నుంచి 31వ తేది వరకు డయేరియా నివారణ, విటమిన్ ఏ క్యాంపు నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు.



చిన్నారులకు విటమిన్ ఏ, ద్రవం, ఓఆర్ఎస్ మిశ్రమం లకిగిన కిట్ల పంపిణీని ప్రారంభించి పరిశీలిస్తున్న మంత్రి సుబ్రమణ్యం తదితరులు

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యకు సీఎం జన్మదిన శుభాకాంక్షలు

పెరంబూర్, జూలై 1: మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడుకు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సీఎం తన ఎక్స్‌లో... రిపబ్లిక్ ఆఫ్ ఇండియా మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యానాయుడు గారికి జన్మదిన శుభాకాంక్షలు. మీరు సంతోషకరమైన, ఆరోగ్యమైన జీవితంతో ఉండాలని కోరుకుంటున్నట్లు సీఎం పేర్కొన్నారు.

అఖిలేష్ యాదవ్‌కు...

సమాజ్‌వాద్ పార్టీ నేత అఖిలేష్ యాదవ్‌కు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సీఎం తన ఎక్స్‌లో... అఖిలేష్ యాదవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు. మీ అద్భుతమైన నాయకత్వం కారణంగా ఉత్తరప్రదేశ్‌లో ఇటీవల జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో సమాజ్‌వాదీ పార్టీ అఖండ విజయం సాధించింది. 'ఇండియా' కూటమికి మీ సహకారం ఎంతో ముఖ్యం. భవిష్యత్తులో మీరు మరింత గొప్ప బాధ్యతలు చేపట్టాలని మేము ఎదురుచూస్తున్నాము అంటూ సీఎం పేర్కొన్నారు.



విజేతలతో నిర్వాహకులు, అతిథులు

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

● సూరిశెట్టి బాలాజీ

ప్యారీస్, జూలై 1: క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని వాసవి క్లబ్ 2 స్టార్ ఎలైట్ చెన్నై అధ్యక్షుడు సూరిశెట్టి బాలాజీ పేర్కొన్నారు. వాసవి క్లబ్స్ వి-502ఏలోని వాసవి క్లబ్ 2 స్టార్ ఎలైట్ చెన్నై, వనిత క్లబ్, టైమ్ టు చెస్ సంయుక్త ఆధ్వర్యంలో ఎలైట్ చెస్ ఛాంపియన్ పేరిట జిల్లా స్థాయి చెస్ పోటీలు ఘనంగా నిర్వహించారు. తిరువొత్తియూర్‌లోని మహర్షి విద్యామందిర్‌లో ఆదివారం ఉదయం ఐఎన్‌పీ ఆర్.రవిచంద్రన్ ప్రారంభించిన ఈ పోటీల్లో చిన్నారుల కేటగిరీలో 7 నుంచి 16 వయసువారు ఉత్సాహంగా పాల్గొన్నారు. అలాగే, 16 ఏళ్లకు పైబడిన వారు కూడా ఓపెన్ కేటగిరీలో పాల్గొని చదరంగంపై ప్రతిభ కనపరిచారు. సాయంత్రం 7 గంటలకు బహుమతుల ప్రదానోత్సవం జరిగింది. క్లబ్‌ల అధ్యక్షులు బాలాజీ, దివ్య, బీఎల్ కుమరవేల్-చిత్ర, మహర్షి విద్యామందిర్ కరస్పాండెంట్ హర్షిణి, టి.రాజశేఖర్-జయశ్రీ, మన్నార్ ఉదయకుమార్ తదితరులు పాల్గొని విజేతలను అభినందించారు.

జీవా వాటర్‌తో మురుగప్ప వాటర్ ఎంఓయూ

అడయార్, జూలై 1: ఇన్నోవేటివ్ వాటర్ మేనేజ్‌మెంట్‌లో అగ్రగామిగా ఉన్న మురుగప్ప వాటర్ టెక్నాలజీ అండ్ సొల్యూషన్స్ (ఎండబ్ల్యూటీఎస్) కంపెనీ జీవా వాటర్‌తో అవగాహనా ఒప్పందాన్ని కుదుర్చుకుంది. వాటర్ సమస్యల పరిష్కారం నిమిత్తం ఈ కీలక ఒప్పందాన్ని కుదుర్చుకోగా, ఇరు సంస్థల ప్రతినిధులు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎండబ్లూటీఎస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ జయతీర్థ నడ్గిర్, జీవా వాటర్ ఫౌండర్ డాక్టర్ కృష్ణ మదప్ప, జీవా వాటర్ కో ఫౌండర్ శ్రీనివాసన్ విటోబా తదితరులు పాల్గొన్నారు. పారిశ్రామిక, వ్యవసాయం, గృహ వినియోగ రంగాల సహా కీలకమైన మార్కెట్ విభాగాలకు జీవా వాటర్ పరికరాలను పరిచయం చేయడం ఈ ఒప్పంద లక్ష్యమని వారు పేర్కొన్నారు. ఇప్పటికే జీవా వాటర్ డిజైన్‌లు వివిధ అప్లికేషన్లలో అద్భుతమైన ఫలితాలను సాధించాయని వారు గుర్తుచేశారు.



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న దృశ్యం

చెన్నై అమృత గ్రూపు బ్రాండ్ అంబాసిడర్‌గా నటి శ్రీలీల

అడయార్, జూలై 1: చెన్నై అమృత గ్రూపు ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా హీరోయిన్ శ్రీలీల నియమితులయ్యారు. ఈ విషయాన్ని ఆదివారం నగరంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆ సంస్థల ఛైర్మన్ ఆర్.భూమినాథన్ ప్రకటించారు. నగరంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో నటి శ్రీలీల పాల్గొని, ఏవియేషన్ కోర్సులో చేరిన 10 మంది విద్యార్థులకు అడ్మిట్ కార్డులను అందజేశారు. కాగా 2010 నుంచి హోటల్ మేనేజ్‌మెంట్ ఎడ్యుకేషన్‌లో అగ్రగామిగా ఉన్న చెన్నై అమృత గ్రూపు తన విద్యా సంస్థల శాఖలను బెంగళూరు, విజయవాడ, హైదరాబాద్ నగరాల్లో ప్రారంభించిన విషయం తెల్సిందే. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ ప్రతినిధులు, అనేక మంది విద్యార్థులు పాల్గొన్నారు.



నటి శ్రీలీల, భూమినాథన్ తదితరులు

అపోలో ఆస్పత్రిలో వైభవంగా వైద్యుల దినోత్సవం

చెన్నై, జూలై 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక అపోలో ఆసుపత్రుల్లో సోమవారం ఉదయం జాతీయ వైద్యుల దినోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆసుపత్రుల్లో వివిధ విభాగాల్లో పనిచేసే వైద్య నిపుణులు, సిబ్బంది, నర్సులు కలిసి కేక్‌లు కట్ చేసి అందరికీ తినిపించి వేడుకలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమాల్లో అపోలో హాస్పిటల్స్ మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ ఆర్కే. వెంకటాచలం తదితర వైద్యులు పాల్గొన్నారు.



వైద్యుల దినోత్సవంలో పాల్గొన్న అపోలో ఆసుపత్రి వైద్యనిపుణులు, సిబ్బంది తదితరులు



చెన్నై ఓమండూరార్ ప్రభుత్వ ఆస్పత్రిలో జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా వైద్యులకు పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న వైద్యవిద్యార్థినులు, నర్సులు తదితరులు



మదురై తోప్పూరు ప్రభుత్వ క్షయవ్యాధి ఆస్పత్రిలో పనిచేసి రిటైరైన సందర్భంగా చెన్నై క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కలుసుకున్న ఆ ఆసుపత్రి నిర్వహణాధికారి డాక్టర్ కాంతిమదినాథన్, తదితరులు

'ప్రజలవద్దకే వైద్యం' పథకంపై విదేశీ విద్యా సంస్థలో ప్రసంగించేందుకు అమెరికా వెళ్తున్న సందర్భంగా తన క్యాంపు కార్యాలయంలో కలిసిన ఆరోగ్యశాఖ మంత్రి ఎం. సుబ్రమణ్యంకు శుభాకాంక్షలు తెలుపుతున్న ముఖ్యమంత్రి స్టాలిన్





చెన్నైలో రోటరీ డిస్ట్రిక్ట్ 3233 ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ వైద్యుల దినోత్సవ వేడుకల్లో అవార్డులు స్వీకరించిన వారితో సీనియర్ పాత్రికేయులు ఎన్.రామ్ తదితరులు

ఢిల్లీలో రైల్వే శాఖ సహాయ మంత్రి రవనీత్ సింగ్ బిట్టూను మర్యాదపూర్వకంగా కలుసుకున్న ద్రావిడ దేశం అధ్యక్షుడు వి. కృష్ణారావు

